




# కొడుకు

'శ్రీవిరించి'



ఆకాశం చిల్లులు పడినట్లుగా వర్షం కురుస్తోంది. ఆ చిల్లులు ఎవరో తాత్కాలికంగా మరమ్మత్తు చేస్తున్నట్లు నిలిచిపోతోంది మధ్యలో రాములమ్మ ఉంటున్నది పెంకుటిల్లు - ఔట్‌హౌస్ - పేరుకు అలావుంది గాని ఇంకో రెండు రోజులు కథయిలాగే నడిస్తే మట్టిగోడలు సాంతం కరిగిపోయి నేలమట్టం అవుతుందేమోనని భయంగా వుంది.

ఒంటరి జీవితం.

దానికి తోడు యిప్పుడు యిదో విలయం వచ్చిపడింది. ఈ వానలో యేమయిపోయాడో తెలియదు, కుమార్ - తొమ్మిది యేళ్ళవాడు కనబడడం లేదు.

మొగుడు పోయినప్పటినుంచి రెండు కళ్ళు వాడే అయి బతుకు యీడ్చుకుంటూ వస్తోంది. రాములమ్మ. బడినుంచి తిన్నగా యింటికి రావలసినవాడు యేమయినాడో తెలియదు. ఆటపాటలకు, అల్లరిపనులకు ఎక్కడికీ వెళ్లడం తెలియని వాడు...ఎక్కడని వెదకడం?

అక్కడికీ అలాగే వానలో తడుచుకుంటూ వెళ్లి పంతులయ్య యింట్లో విచారించింది తీరా చూస్తే, పంతులయ్యకు కుమార్ ఆరోజు బడికి వచ్చాడో లేదో ఆనవాలు లేనే లేదు.

'అయ్యో,...పొద్దున్నే తొమ్మిదింటికి వాన జోరు కాస్త తగ్గిరావడంతోటే అన్నంతిని సంచి బుజానికి తగిలించుకుని బడికి పరుగుతీశాడు, పంతులయ్యగారూ-' అని మొరపెట్టుకుంది రాములమ్మ.

'వచ్చాడో లేదో నాకు తెలియదు. గుర్తులేదు. అటెండెన్స్ రిజిస్టర్ చూస్తేగాని నేను యే సంగతీ నికరంగా చెప్పలేను. వాడి ముఖం యివాళ చూచినట్లు గుర్తురావడం లేదు నాకు. అయినా అందరి ముఖాలు గుర్తు వుంటాయాయేమిటి? ఆగ్యారంటీకూడ లేదనుకో, పక్క కుర్రవాళ్లను విచారించు, వాళ్లకేమన్నా తెలుసునేమో!' అని మాత్రం అన్నాడు పంతులయ్య.

తోటి కుర్రవాళ్లను కనుక్కోవడం తప్ప యింకో మార్గం లేకుండాపోయింది. కుర్రవాళ్లు రకరకాలుగా చెప్పారు.

కొందరు కుమార్ బడి చివరదాకా చూశామన్నారు.

కొందరు పొద్దున్న చూచినట్లు గుర్తు అన్నారు.

సాయంకాలం ఎక్కడికో వెడతానని చెప్పాడు అన్నారు మరికొందరు.

ఎవరూ అంటరానివాడితో రోజంతా తోడుగా వున్నవాళ్లు లేరు.

వాన వస్తోంది కనక స్కూలు మధ్యాహ్నం సెలవు యిచ్చేశారు. పిల్లలందరూ త్వరత్వరగా వెడతున్నామన్న సంబరంలో ఎవరిదారిన వాళ్లు పరుగులుతీయడం వల్ల ఎవరు యేదిక్కుగా వెళ్లారో ఎవరికీ గమనం లేదు.

సాయంత్రం ఆరుగంటలదాక అక్కడ యిక్కడ తిరిగి అన్ని యిళ్ళల్లోనూ వాకబు చేసుకుని నిరాశగా బేలగ యింటికి చేరుకుంది.

ఈ మాదిరి వాన వచ్చినప్పుడు రాములమ్మ నివాసం ఔట్‌హౌస్‌లో కాదు. ముందు యింట్లోనే వంటగది పక్కన వసారాలో - సిమెంటు కప్పు వసారాలో తలదాచుకోనిస్తారు. అక్కడే ఈ ఉదయం రాములమ్మ, కుమార్ ఒకళ్ళ దగ్గర ఒకళ్లు అప్యాయంగా సెలవుతీసుకున్నారు.

రాములమ్మ యింటికి రావడం తోటే సుశీల అడిగింది. 'ఏమయింది? ఏమయినా జాడ తెలిసిందా?!

దీర్ఘంగా నిట్టూర్చడం తప్ప వెంటనే యేమీ పలకలేక పోయింది రాములమ్మ.

'వానలో యింటికి రాలేక యింకెక్కడయినా వుండిపోయినాడేమో! కంగారు పడకు, రాములమ్మా, కాస్త ముందుగది హాలు శుభ్రం చేయి. ఎవరో స్నేహితులు వస్తారట! అంది సుశీల.

రాములమ్మ ఆ పనిలో మునిగిపోయింది.

మళ్లీ వసారాలోనికి వచ్చింది.

ఏమాత్రం అలికిడి అయిన కుమార్ వచ్చాడేమోనని తలయెత్తి చూడడం తప్ప యింకో ధ్యాస లేదు.

నిజానికి ఈ రోజు వాన తక్కువేనని చెప్పవచ్చు.

ఉండి ఉండి జల్లు పడుతుంది. మొదలయిన పది నిముషాల వరకు 'వర్షం' తప్ప యీ ప్రపంచంలో యింకా పదార్థంయేమీ లేదన్నంత తీవ్రత తరువాత గప్‌చిప్ అరగంట , ముప్పావుగంట వరకు చడి చప్పుడు వుండదు.

ఇలా ప్రతినెలా వారం, పదిరోజులపాటు వానలు, వరదలు అతిథులలాగ వచ్చిపోతూ వుండడం ఈ మధ్య అలవాటు అయిపోయింది.

అయ్య వచ్చాక చెప్పి చూడండమ్మా-' అంది రాములమ్మ.

చెబుతాన్లే!

రాములమ్మ మోకాళ్ళమీద కు తలదించుకుని కూర్చుండి పోయింది.

సాయంకాలం వంటకు యింకా సమయం కాలేదు.

బడికి వెళ్లిన వాడు యింటికి రాకుండా వుండడం యింతవరకూ జరగలేదు. ఇదే మొదలు. ఏమయ్యాడో...ఏమయ్యాడో... యిదే ప్రశ్న రాములమ్మ గుండెల నిండా, మనసునిండా ...భయం, ఆదుర్దా...మనసు మనసులో వుండకుండా చేస్తున్నాయి.

ఆ రాత్రి పదిగంటలు దాటిన తర్వాతగాని అయనతో మాట్లాడే అవకాశం రాలేదు. ఎనిమిది గంటల ప్రాంతంలో ముగ్గురు అతిథుల్ని తీసుకు వచ్చాడు, యింటి యజమాని సుశీల చేయవలసిన వంటకాలు అప్పుడు గాని చెప్పలేకపోయింది. మనసు మనసులో లేకపోయినా, శరీరం పూర్తిగా సహకరించకుండావున్నా, ఆ పనంతా అవలీలగా గంటలో చేయగలిగింది రాములమ్మ.

అందరి బోజనాలు అయ్యేటప్పటికి తొమ్మిదిన్నరదాటింది.

అతిథులు వెళ్లి పోయారు.

రాములమ్మ బిక్కబిక్కుమంటూ సుశీల వంక చూస్తోంది. ...ఇప్పుడు గుర్తు చేయవచ్చునో లేదో...ఈ రాత్రిపూట లేం జరుగుతుంది? ఎక్కడని వాకబు చేయడం? వానపడుతూ వుండకపోయినా గాలిలో తేమ, చలి శరీరాలను అస్తవ్యస్తం చేసేస్తున్నాయి. దుప్పట్లు, గొంగళ్ళు మునుగుపెట్టుకు పడుకోవడమే గాని మరో ఆలోచన మనస్సుకు తెచ్చుకోగల సమయమూ సందర్భమూ కాదు.

సుశీల భర్త ఈ విషయం వినడంతోటే ఎంతా ఆదుర్దా కనబరిచాడు.

బడినుంచి రానే లేదా? ఏమయినట్లు?

'ఆ ప్రశ్నకు జవాబు దొరకకే గదండీ రాములమ్మ సాయంత్రం నుండీ వ్యథ పడుతున్నదీ?'' అని సుశీల ఎదురు ప్రశ్నవేసినప్పుడుగాని తన ప్రశ్నలో అవివేకం అతనికి అర్థం కాలేదు.

పోలీస్ రిపోర్ట్ యివ్వాలి తక్షణం. వాళ్లకు యేమయినా సమాచారం అందివుంటుంది-న్నాడు.

'పోలీస్ స్టేషన్‌కు వెడతాను. మీరో కాగితం ముక్క రాసివ్వండి-' అంది రాములమ్మ.

అతను చేతి గడియారం వంక చూచాడు.

'ఊహూ ఈ చీకట్లో నువ్వు ఒక్కదానివీ వెళ్లవద్దు. నేను టెలిఫోన్ చేసి చెబుతాను వెళ్లకు-'' అంటూ అతను పోలీస్ స్టేషన్‌కు రింగ్ చేశాడు.

చాలాసేపటివరకు అవలి పక్కనుండి ఏమీ బదులు లేదు.

ఈ వానలకు లైన్స్ చెడిపోయినాయె యేమో - అన్న అనుమానంతో రిసీవర్ క్రెడిల్ చేసేద్దాం అనుకుంటున్న సమయంలో యేదో సణుగుడు, ఎవరో నీరసంగా 'హలో' అనడం వినిపించింది.

అతను చెప్పాడు.

దేవుడు మేలుచేసి ఇన్‌స్పెక్టర్‌యింకా స్టేషన్లోనే వున్నాడు.

వివరాలన్నీ 'నోట్' చేసుకున్నానన్నాడు.

'తప్పకుండా వెదికిస్తాం. ఏమయినాడో విచారిస్తాం. మరేం వర్రీకాకండి-' అని భరోసా యిచ్చాడు.

'చూడండి. ఇన్‌స్పెక్టర్ కొస్త శ్రద్ధగా విచారించిలి మీరు పాపం బధ్యాహ్నం నుండి ఆ పిల్లవాడి తల్లి యమయాతన పడిపోతోంది- అన్నాడు అతను.

అవతలిగొంతు మరో రెండు నిముషాలు ఏవో జవాబులు చెప్పిన తరువాత ' ఈపూట రోడ్ను ప్రమాదాలు, లారీ యాక్సిడెంట్లు యేమయినా రిపోర్ట్ అయినాయా? అని అడిగాడు.

రాములమ్మ గుండెలు చేత్తో పట్టుకు కూర్చుంది.

'అలాగా ఈ ప్రాంతంలో ఎలాంటి ప్రమాదమూ జరగలేదన్నమాట. థాంక్స్ నా నెంబర్ మళ్లీ నోట్ చేసుకోండి - థాంక్స్ ఉంటానండీ-' అని ఫోన్ రిసీవర్ పెట్టేశాడు.

రాములమ్మకు ధైర్యం చెబుతున్నట్లుగా మళ్లీ అంతా వివరించాడు.

'ఏమి భయపడకు, రాములమ్మ. కుమార్ చురుకయిన కుర్రవాడు. వాడికేం భయంలేదు. ఎక్కడో యేదో పొరపాటు జరిగింది. అంతే తెల్లవారేటప్పటికి యింటికి వచ్చేస్తాడు. ధైర్యంగా వుండు. తెల్లవారగానే మళ్లీ పొన్ చేసి కనుక్కుందాం,' అన్నాడు.

ఆ రాత్రి పడుకున్నదన్నమాటే గాని రాములమ్మకు కునుకుపట్టలేదు. అసలు కళ్లు మూతలు పడనే లేదు.

కొడుకు..కొడుకు..గురించే ఆలోచనలు.

తను పక్కన లేకపోతే నిద్రపట్టదు వాడికి.

పుట్టిన తరువాత యిదే మొదలు.

ఎక్కడ ఏం అవస్థ పడుతున్నాడో, కుర్రసన్యాసి.

మధ్యాహ్నం అన్నం ఎక్కడ తిన్నాడో యేమో!

వాడికి అప్యాయంగా పడిలో

కూర్చోబెట్టుకుని ముద్దలు కలిపి పెడతా?

ఏమయ్యాడో? ఏమయ్యాడు?

తొమ్మిదిమాసాలు మోసి కని పెంచిన కొడుకు.

తొమ్మిదేళ్ళుగా కంటికి రెప్పలా కాపాడుకుంటూ వన్తున్న కొడుకు. కనిపించకుండా పోయాడు.

రాములమ్మ మనసు ముప్పయి ఏళ్ల జీవితాన్ని, ఒకమారు పర్యావలోకనం చేసుకుంది.

పుట్టటం పెరగటం పెళ్లిచేసుకోవడం

భర్తతో కాపురం

కుమార్ కడుపున పడడం

భర్త ఆనందం..

వాడికి కుమార్ అని పేరు పెట్టాను అయనే నిర్ణయించాడు. కుర్రవాడు పెద్దవాడు కాకముందే వాడికి రెండేళ్ళయినా నిండకుండానే ...భర్త అనుకోకుండా చనిపోవడం.

జీవితంలో వున్న అధారం దారం కాస్తా తెగిపోవడం..


ఒంటరితనం

బతుకు వీధిన పడుతుందేమోనన్న భయం.

నా అన్నవాళ్ళు లేకపోయినా, నీతిగా నిజాయితీగా వుండడం కోసం నానా అగచాట్లు పడడం..

-అంతా మనసులో మెదిలింది రాములమ్మకు. గతం గుర్తుచేసుకోకుండా ఇన్నాళ్ళూ జీవితం గడిచిపోయింది. తలుచుకోవలసిన గతం ఏమీలేకపోవడం ఒకటే కాదు...కారణం. జీవితం పీడకల అనుకోకుండా, జరిగిన వన్నీ జరిగినట్లు గానే తలవొగ్గి స్వీకరిస్తూ...ముందును గురించి ఆశలు, అతిశయాలు పెట్టుకోకుండా యాధాలాపంగా జీవితం గడిచిపోయేట్టు చూచుకోవడం ...అందులో వున్న తృప్తి రాములమ్మకు బాగా తెలుసు.

అందుకే భర్తపోయే సమయానికి మరో నలుసు కడుపులో పడినా, చుట్టుపక్కల వాళ్లందరూ పోయినవాడే మళ్లీ ప్రాణం పోసుకని యిట్లా వస్తాడని ఊరట చెప్పి తన ప్రయత్నం విరమించుకుందుకు బోధనలు చేసినా వర్తమానంమటుకే దృష్టిలో వుంచుకుని, డాక్టర్ కాళ్లు చేతులు పట్టుకుని కావలసిన కాగితాలన్నీ సంతకం చేసి కేవలం తన మొండి ధైర్యం మీదనే ఈ నలుసుకు ప్రాణం జతకాక ముందే మాంసం ముద్దను




తనలోనుండి యువతలకు తీసివేయించుకుంది.

అయనతో కాపురానికి గుర్తుగా కొడుకు ఉన్నాడు. తాను అందుకే అలా నిర్ణయం తీసుకుంది.

గౌరవంగా తన పొట్ట తను పోషించుకుందుకు, కొడుకును చక్కగా పెంచేందుకు. .దేశంలో మంచితనం అంతా యింకా ముందుకు పోలేదనటానికి సాక్ష్యంగా యేదో సంపన్న కుటుంబాలు వంటపనులు, యింటి పనులు చేసుకుంటూ కాలక్షేపం చేసే అవకాశం కలుగుతూనే వుంది. అందరూ దుర్మార్గులు కాదు. నాలో చెడ్డ అలోచలు లేకపోత చుట్టుపక్కల వున్నవాళ్ళు నన్నేమీ చేయలేరు అన్న భరోసాయే రోజులు దొర్లించేస్తుంది.

జీవితంలో ఒక్కటే ధ్యేయం.

కొడుకు...వాడికి చదువు చెప్పించడం... పెద్దవాడిన చేయడం..వివాహం..వాడి సంసారం వాడిది..తరువాత తను ఏమయి పోయినా బెంగలేదు. ఈ బతుకంతా కొడుకు కోసం. కొడుకు అభివృద్ధి కళ్ళారా చూచి ఆనందించాలనీ...స్వార్థం!...ఆ సంబరాలు పొందాలని కూడా కాదు.

తాను యేమయిపోయినా ఫరవాలేదు. కొడుకుమాత్రం చల్లగా వుండాలి. 'నాలోపం లేకుండానేను వాడిని సాకుతున్నాను. పై నుంచి నువ్వుకూడ దీవించు వాడిని...' అని మననులో తలపోనుకుంటుంది. భర్త ఫోటోవంక చూస్తూనే. అయన తన మాటలు విన్నట్లు, అమోదించినట్లు, ఆశీర్వాదంగా నవ్వుతున్నట్లు కనిపిస్తుంది... అనిపిస్తుంది.

తెల్లవారిపోయింది.

ఆకాశంలో మబ్బులు యింక అలాగే ఉన్నాయి.

కాస్త ఎండకూడా వస్తోంది - ఓపక్క నుంది - బరబరా.

సుశీల రాములమ్మను చూడడంతోటే ఆత్రంగా, 'వచ్చాడా అబ్బాయి?' అని అడిగింది.

రాములమ్మకు దు:ఖం ముంచుకు వచ్చింది.

జవాబు చెప్పవలసిన అవసరం లేకుండానే సుశీల పరిస్థితి అర్థం చేసుకుంది. భర్త దగ్గరకు వెళ్ళింది.

పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేశారు.

పరిస్థితిలో యేమీ మార్పులేదు.

ప్రమాదం జరిగినట్లు వార్త చెవులకు తగలకుండా ఉండడమే గొప్ప విశ్రాంతి - అనిపిస్తోంది.

కుమార్ ఫోటో ఒకటి తీసుకువ్నాడు సుశీల భర్త. స్టేషన్లో చూపించటానికి.

'మరేం బెంగపడకు, రాములమ్మ. ధైర్యంగా ఉండు. నీ ధైర్యమే వాడికి రక్ష. అయ్యగారు పోలీస్ స్టేషన్‌కు వెడతారు. స్వయంగా కనుక్కుంటారు. అంతగా అవసరం అయితే-రేపు రేడియోలో చెప్పిస్తారు. టెలివిజన్‌లో చూపిస్తారు. అబ్బాయి ఫోటో ఉందిగా- మరేం ఫరవాలేదు. దొరుకుతాడు. పేపర్లో వేయిద్దాం. ఆచూకీ చెప్పినవాళ్ళకు బహుమతి యిప్పిద్దాం....' అంటూ వరసగా చెప్పుకుపోతోంది, సుశీల.

రాములమ్మకు రోజు గడుస్తున్న కొద్దీ మనసు బరువు పెరుగుతోంది.

మళ్ళీ బడికి వెళ్ళింది.

పంతులయ్య ఆమెనే అడిగాడు. 'ఇవాళ గమనించి చూచాను. వాడు క్లాసులో కనబడలేదు. కుమార్ ఏమయినాడు?' అని

కళ్ళు తుడుచుకుంటూ బయటకు వచ్చేస్తూంటే పంతులయ్యే అన్నాడు., మళ్ళీ : 'ఏమమ్మా నువ్వేం అనుకోకపోతే నేను ఉపాయం చెబుతాను-'

రాములమ్మ ఆశగా చూచింది.

'పెద్ద బజారు వెనకాల మూడో వీధిలో - రావి చెట్టుకు ఎదురుగుండా ఓ నీలిరంగు డాబా ఉంది. ఆ డాబా పక్కసందులోంచి వెడితే బాగా లోపల - మరోడాబాలో ప్రశ్నలు చెప్పే పండితుడు ఒకాయన ఉన్నాడు. నీ అదృష్టం ఎలా ఉందో వెళ్ళి అడుగు.

రాములమ్మ నిదానంగా ఆకళింపు చేసుకుంది.

అలాగే వెడతాను. అందులో కానిదేం ఉంది - అంతకంటే చేసేదేముంది --- అనుకుంది.

'వెళ్ళేటప్పుడు తమలపాకులు, వక్కలు, పూలు, పళ్ళు తీసుకుపోవాలి సుమా!'

రాములమ్మ తలఊపింది.

'సాంబ్రాని కడ్డీలు కూడా'

అలాగే - అలాగే - అనుకుంది రాములమ్మ.

మళ్ళీ ఎండ ముదిరిపోకముందే - పండితుడి దగ్గరకు వెళ్ళివస్తే సరిపోతుంది. అదీగాక మనసులో ఒక ఆలోచనజొరబడ్డాక, ఆపనిచేసి వేయకపోతే - నిదానం ఉండదు. ఆదుర్గా తరుముతున్న మనిషిలా సుశీలతో చెప్పి బయలుదేరింది. రాములమ్మ. సరంజామా అంతా పోగుచేసుకుని.

'నాకు యివన్నీ యేమీ నమ్మకంలేదు. అయినా నీ తృప్తికోసం-' అంటూ సుశీల ఆమెకు కావలసినవన్నీ సమకూర్చింది.

- నాకు మటుకు నమ్మకం ఉందా యేమిటి? అన్ని నమ్మకాలు వమ్ము అయిపోయాయి. ఈ కొడుకు ఒక్కడే కల్పవృక్షం. కామధేనువు అనుకుంటూ బతుకుతున్నాను - అనుకుంది రాములమ్మ.

పైకి మాత్రం ' మనిషిలో ఏమహాత్మ్యం ఉందో! ఆ పండితుడు పుస్తకం చూచి, తమలపాకులు - వక్కలు లెక్కపెట్టి - గుణించి చెబుతాడట! పోనీ చూచి వస్తాను. ఏమయినా ఆచూకీ దొరుకుతుందేమో!' అంది.

సుశీలకు అనిపించింది - మనసులో.

పోలీస్ రిపోర్ట్ యిస్తున్నాం.. పేపర్లో వేయిస్తున్నాం... అలాగే ప్రశ్నలు అడగడం కూడా ఒక పద్ధతి. దేవుడికి మొక్కు కుంటున్నాం. మన ప్రయత్నాలు మనం చేస్తున్నాం. ఒక డాక్టర్ను మార్చి మరో డాక్టర్ దగ్గరకు వెడుతున్నాం. గ్రహచారం ఎలా ఉంటే అలా జరుగుతుందిలే అని ఊరుకుంటున్నామా? ఏమిటో అంతా గందరగోళం. రాములమ్మతో ఆ మాటలు పైకి అనకుండా ఉండవలసిందేమో... ఏమనుకుంటుందో పాపం!

ఆచూకీ ప్రకారం వెళ్ళింది రాములమ్మ.

మధ్యాహ్నం పన్నెండు గంటలయింది.

సూర్యుడు సరీగా నెత్తిమీద ఉన్నాడు.

మబ్బులు తప్పుకు తప్పుకు తిరుగుతున్నాయి. అవసరం అయినప్పుడు రంగప్రవేశం చేయవచ్చులే అన్నట్లుగా.

పండితుడు పూజలో ఉన్నాడు.

వరండాలో నలుగురయిదుగురు అప్పటికే వచ్చి కూర్చుని ఉన్నారు.

రాములమ్మ ఓ పక్కగా చతికిలపడింది.

ఒంటిగంటకుగాని ఆమె వంతు రాలేదు.

వెడల్పాటి ముఖం. నుదురంతా ఎర్రటి కుంకుమ.

దట్టంగా వొత్తుగా ఉన్న కనుబొమ్మలు.

మీసాలు, గడ్డం ...

తెల్లని ఉత్తరీయం కప్పుకుని కూర్చున్నాడు పండితుడు. ఆయన ముందు తాళపత్ర గ్రంథాలు పుటలు తెరుచుకు ఉన్నాయి.

రాములమ్మ చేతిలోనుండి ఆకులు, వక్కలు అందుకున్నాడు. ఆమె పండితుడి ముఖంలోకే చూస్తూ కూర్చుంది.

ఎక్కడా పోలికలు లేకపోయినా, ఏడేళ్ళనాడు పోయిన భర్తవాలకం పండితుడిలో కనిపిస్తోంది రాములమ్మకు.

కళ్ళునులుముకుని చూస్తోంది.

పండితుడు నోరు విప్పాడు. లెక్కలు కట్టటం అయిన తరువాత.

'దు:ఖపడకు. కనిపించనివాడు మరి కనిపించడు. కారణాలు అడగకు,' అన్నాడు.

రాములమ్మ నోటమాటరాక నేలకు అతుక్కుపోయి కూర్చుండిపోయింది.

'కనిపించినవాడు కళ్ళకు కనిపించడు. కాని అన్నిచోట్ల వాడే వుంటాడు. అందరిలోనూ వాడే వుంటాడు. ఈ ప్రసాదం తీసుకో. విరామంగా వుండు-' అన్నాడు పండితుడు మళ్ళీ.

రాములమ్మ మరో పావుగంట గడిచాక యింటికి నడిచిపోతోంది.- రోడ్డువెంట.

మొండిధైర్యంతో అడుగులు వేస్తోంది.

కని, పెంచిన కొడుకు కనబడకుండా పోతే తనబతుకంతా యేమయిపోవాలి!

ఎందుకు యింకా యీబతుకు?

నాలుగురోడ్లకూడలిలో మరో పెద్దబడి ఉన్నట్లుంది. దాన్లో పదిగంటలు వినబడుతున్నాయి. నేలకు అతుక్కుపోయింది- రాములమ్మ. గంటలు ఆగిపోవడంతోటే బిలబలమంటూ బడిపిల్లలు రోడ్డుమీదకు వచ్చేశారు. వేగంగా నాలుగురోడ్లకూడలిదాటి ఎగబడి ముందుకు పోతున్నారు- ఓ పెద్ద ప్రవాహం దీవి అన్నివైపులకు పాకుతూ ఉన్నట్లుగా.

తనకొడుకు వాళ్ళలో యెక్కడయినా ఉన్నాడా- అని చూస్తూ నిలబడిపోయింది రాములమ్మ చాలసేపు.

కుమార్ కనబడలేదు.

బడికి వెళ్ళి చదువుకునే పిల్లలందరూ నా పిల్లలే. ఒక కుమార్ కనిపించకపోతేనేం?- అనుకుంది.

రాములమ్మ మళ్ళీ ముందుకు అడుగులు వేయగలుగుతోంది. ●

బీజింగ్‌లో జరిగిన మహిళా సదస్సు గురించి, చైనా సాంస్కృతిక రంగం గురించి ప్రముఖ రచయిత్రి 'ఓల్గా' అందించిన విశేషాలను 'ఆహ్వానం' నవంబర్ సంచికలో చదవండి